క్లుప్తంగా

విజేతలకు బహుమతుల అందజేత



బహుమతులు ఇస్తున్న హెచ్‌ఎం తదితరులు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు పాఠశాల హెచ్‌ఎం రామాజంనేయరెడ్డి, ఏఐఎస్ఎఫ్ జమ్మలమడుగు ఏరియా కార్యదర్శి శరత్ కుమార్, కళాశాల ప్రిన్సిపల్ బహుమతులు అందజేశారు. అంతకుముందు ఏఐఎస్ఎఫ్ జెండాను ఎగుర వేశారు.

చెస్‌లో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని ఆశీర్వదిస్తున్న ఉపాధ్యాయుడు

ఎర్రగుంట్ల : జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అదివారం ప్రొద్దుటూరులోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో అండర్–13, అండర్–11 టోర్నమెంట్ జరిగింది. ఇందులో ఎర్రగుంట్ల మండలంలోని జువారీ డీఏవీ స్కూల్ విద్యార్థిని కె హర్షిత ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపల్ ఎంవీజీఎస్ నాయుడు సోమవారం తెలిపారు.విద్యార్థినికి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ చంద్ర ఓబులేసు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన కృష్ణమూర్తి

సింహాద్రిపురం: సింహాద్రిపురం మండల ఎంపీడీఓగా కృష్ణమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సాధారణ ఎన్నికల నేపథ్యంలో బదిలీపై చిత్తూరు జిల్లా తంబళ్లపల్లె ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల అనంతరం తిరిగి బదిలీపై సింహాద్రిపురానికి వచ్చారు. ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న సాల్మన్‌రాజ్ అనంతపురం జిల్లా రాప్తాడు మండలం ఎంపీడీఓగా బదిలీపై వెళ్లారు.

వల్లూరు ఎంపీడీఓగా జయశ్రీ..



బాధ్యతలు స్వీకరిస్తూ...

వల్లూరు: వల్లూరు మండల ఎంపీడీఓగా పి. జయశ్రీ బాధ్యతలు స్వీకరించారు. వల్లూరు ఎంపీడీఓగా ఉన్న జయశ్రీ ఎన్నికల నిర్వహణ నిమిత్తం ఇతర జిల్లాకు బదిలీపై వెళ్లారు. అయితే ఇటీవల ప్రభుత్వం ఇతర జిల్లాలకు వెళ్లిన ఎంపీడీఓలను సొంత జిల్లాలకు బదిలీ చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం జయశ్రీ వల్లూరు మండల ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు.

ఎర్రగుంట్ల ఎంపీడీఓగా భాగ్యలక్ష్మి..

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల పరిషత్ అధికారిగా సోమవారం భాగ్యలక్ష్మీ బాధ్యతలను స్వీకరించారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా ఎర్రగుంట్ల నుంచి కర్నూల్ జిల్లాలోని పాణ్యంకు బదిలీ అయ్యారు. మళ్లీ ఇప్పుడు ఎర్రగుంట్లకు వచ్చారు ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీఓ జాషువా రైల్వే కోడూరుకు బదిలీ అయ్యారు.

కలమల్ల ఎస్ఐగా తిమోతి..



బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ తిమోతి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని కలమల్ల ఎస్ఐగా తిమోతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జమ్మలమడుగు డివిజన్‌లో స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐగా విధులు నిర్వర్తించారు. బదిలీలలో భాగంగా కలమల్ల పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతామని చెప్పారు.

నూతన నియామకం

పులివెందుల రూరల్: ఎన్డీఏ ముస్లిం జేఏసీ జాయింట్ సెక్రటరీగా షేక్ ఇమామ్ ఎంపికయ్యారు.విజయవాడ ఐలాపురం గ్రాండ్‌హోటల్‌లో జరిగిన సమావేశం అనంతరం సభ్యుల ఆమోదంతో రాష్ట్ర ముఖ్య పదవుల కమిటీ ఎంపిక జరిగింది.ఇందులో తనను ఎన్నుకున్నారని షేక్ ఇమామ్ తెలిపారు.

కనిపించని నీటిట్యాంకుల శుభ్రత

- పాచిపడుతున్న వైనం
- భయాందోళనలో ప్రజలు



రాయలాపురంలో పాచిపట్టి ఉన్న నీటి ట్యాంకు



రచ్చుమర్రిపల్లెలో ముళ్లపొదల మధ్య నీటి ట్యాంకు

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధిలోని నీటిట్యాంకులను శుభ్రపరచడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రామాల నుంచి ఇంటి పన్నుల రూపంలో రాగిమానుపల్లె పంచాయితీలో ఏడాదికి రూ.2లక్షల నుంచి రూ.3లక్షలు, యర్రబల్లె పంచాయతీలో రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షలు, అచ్చవెల్లి పంచాయతీలో రూ.40వేల నుంచి రూ.50వేలు, కొత్తపల్లి పంచాయతీ రూ.60వేల నుంచి రూ.70వేలు, ఎర్రిపల్లి, కనంపల్లె పంచాయతీలో రూ.10వేల నుంచి రూ.20వేలను సచివాలయ సిబ్బంది వసూలు చేస్తున్నారు. అయితే ప్రజారోగ్యాన్ని మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

ట్యాంకులను శుభ్రం చేసేదెప్పుడో..

పులివెందుల మండల పరిధిలోని పంచాయితీ పరిధిలోని గ్రామాల్లో ఒక్కో పంచాయతీలో మూడు ట్యాంకులు ఉన్నాయి. ప్రతి గ్రామంలో మినీ ట్యాంకులు కూడా మూడు, నాలుగున్నాయి. ఇక్కడి ట్యాంకులకు నీరు నింపి పైపుల ద్వారా ఇళ్లకు సరఫరా చేస్తారు. వీటి ద్వారా గ్రామాల ప్రజలు వాడుతుంటారు. పులివెందుల మండల పరిధిలోని 6 పంచాయతీల్లో సుమారు 20ట్యాంకులు ఉన్నాయి. వాటిని శుభ్రం చేయడానిక 5 నెలలకు ఒకసారి వస్తుంటారని గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ట్యాంకులన్ని పాచిపట్టి అధ్వానంగా మారాయి. అలాగే ట్యాంకుల కింది భాగంలో నీరంతా పాచిపట్టి దోమలు, విషపురుగులు వ్యాప్తి చెందుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో అధిక శాతం మురుగు కాలువల్లోనే తాగునీటి పైపులు దర్శనమిస్తుంటాయి. పొరపాటున లీక్ అయితే మురుగు నీరు పైపుల ద్వారా సరఫరా అవుతుంది. దీంతో చర్మవ్యాధులు, డయేరియా వచ్చే ప్రమాదం ఉందని వైద్యాధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రతినెల ట్యాంకులను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని గ్రామీణ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

ప్రజా సమస్యలపై పోరాటాలకు సన్నద్ధం కావాలి

ఎర్రగుంట్ల : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ప్రజా సమస్యలపైన పోరాటాలు సన్నద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు. సోమవారం ఎర్రగుంట్లలోని సీపీఐ కార్యాలయంలో జమ్మలమడుగు నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం మనోహర్‌బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందికరమైన సమస్యలపై పరిశీలన చేసి వాటిని ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్బరాయుడు మాట్లాడుతూ పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జమ్మలమడుగు నియోజకవర్గ కార్యదర్శి ఎంవీ సుబ్బారెడ్డి , సహాయ కార్యదర్శులు ప్రసాద్, ఎం నారాయణ, ఎస్ రమేష్‌లు, లీలాక్రిష్ణ, శరత్‌లతో పాటు ఇతరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలి

లింగాల: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు వారి పంటలకు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని ఏఓ రమేష్ అన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు సంబంధించి గత ఏడాది మాదిరే ఉచిత పంటల బీమా వర్తిస్తుందన్నారు. సోమవారం మండలంలోని బోనాల గ్రామంలో జరిగిన ఈ పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ పంట నమోదు అయితేనే ఉచిత పంటల బీమా వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బోనాల రైతు సేవాకేంద్రం సిబ్బంది జగదీశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

జమ్మలమడుగు: జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని ప్రగతిశీల రెవల్యూషనరీ స్టూడెంట్ ఫెడరేషన్ (పీఆర్ఎస్‌వైఎఫ్) రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరుశంకర్ పేర్కొన్నారు. సోమవారం ఈమేరకు ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో కరువు ఉండటంతో ప్రజలు పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారన్నారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటైన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాగేంద్రబాబు, దినేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సమష్టి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి

కమలాపురం: దేశానికి పట్టుకొమ్మలు గ్రామీణ ప్రాంతాలు..గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశాలు అభివృద్ధి చెందుతాయి..కాబట్టి సర్పంచ్‌లు, కార్యదర్శులు సమిష్టిగా పని చేసి గ్రామాలను అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఎంపీపీ భారతి అధ్యక్షతన జరిగిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు జరిగిన మూడు రోజుల శిక్షణా కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఉన్న సహజ వనరులను వినియోగించుకుని ఆదాయం పెంచాలన్నారు. అనంతరం టీఓటీలు పలు అంశాలపై వీడియో ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతి, సూపరింటెండెంట్ చలపతి, ఈఓపీఆర్‌డీ శారదారెడ్డి, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి

పులివెందుల రూరల్: పులివెందుల మండల పరిధిలోని గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ వెంకటేష్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.

లింగాలలో..

లింగాల: పంచాయతీలను బలోపేతం చేసి అభివృద్ధి బాటలో నడిపించేందుకే సర్పంచ్‌లు,, పంచాయితీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని ఏఓ లోకేశ్వరరావు అన్నారు.సోమవారం జరిగిన శిక్షణలో రీసోర్స్ పర్సన్స్ సురేష్, సంజీవరాయుడు, రవిలు సర్పంచ్‌లకు తగిన సలహాలు, సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ క్లోరెన్స్ పెబి, పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోండి

సింహాద్రిపురం: సింహాద్రిపురం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరిగే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి తడిచెత్త, పొడిచెత్త వేరు చేసి చెత్తసేకరణ కేంద్రానికి పంపించి ఎరువులు తయారు చేయాలని, పంచాయతీ ఆదాయం పెంచేందుకు కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఈవో పీఆర్డీ పద్మనాభరెడ్డి, పంచాయతీ సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

వేంపల్లె మండలంలో..

వేంపల్లె: మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీల్లో పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థలపై గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లు దృష్టి సారించాలని ఎంపీడీఓ దివిజ సంపతి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 12,13,14 తేదీల్లో రిఫ్రెషర్ ట్రైనింగ్‌లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతి కార్యదర్శి బాధ్యతగా తమ విధులను నిర్వర్తించి, ప్రజలకు అందుబాటులో ఉండాలని, సర్పంచ్‌లు కూడా అందుకు సహకరించాలని కోరారు. ఈఓపీఆర్డీ మల్లికార్జునరెడ్డి, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌లు కీలకం..

ఎర్రగుంట్ల : గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌లే కీలకమని ఎర్రగుంట్ల మండల పరిషత్తు అభివృద్ధి అధికారి ఎస్ భాగ్యలక్ష్మి తెలిపారు. సోమవారం ఎంపీడీఓ సభాభవనంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు గ్రామాలకు వచ్చే నిధులు, వాటి వినియోగం, అభివృద్ధి పనులపై సూచనలు అందించారు. ఈఓపీఆర్డీ రహంతుల్లయ్య పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో

పెండ్లిమర్రి: సర్పంచ్‌లు ,పంచాయతీ కార్యదర్శులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, ఎంపీపీ వరలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో సభా భవనంలో సోమవారం సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదిర్శులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఈఓపిఆర్డి శివరామిరెడ్డి, సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు..విజ్ఞాన భాండాగారాలు



కమలాపురం: విజేతకు బహుమతి అందిస్తున్న ప్రిన్సిపల్ వినోద్ కుమార్



వేంపల్లె: డైరెక్టర్ కుమారస్వామి గుప్తాను సన్మానిస్తున్న సిబ్బంది

కమలాపురం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డా.వినోద్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక కళాశాలలో జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రంథాలయాల విశిష్టత, ఆవశ్యకత గురించి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో లైబ్రేరియన్ విజయభారతి, స్టాఫ్ రవి కుమార్, అశోక్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె: ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీలో జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని నిర్వహించినట్లు డైరెక్టర్ కుమారస్వామిగుప్తా పేర్కొన్నారు. సోమవారం ఇక్కడ కుమారస్వామిగుప్తా మాట్లాడుతూ గ్రంథాలయాలు సరస్వతీదేవి నిలయాలన్నారు.విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలిపారు. అనంతరం క్యాంపస్‌లోని గ్రంథాలయ అధికారి కోనప్ప ఆధ్వర్యంలో డైరెక్టర్ కుమారస్వామి గుప్తాను సన్మానించి మెమెంటో అందజేశారు.

సేవాసమితి భవన నిర్మాణానికి విరాళం

పులివెందుల టౌన్: పులివెందుల పట్టణంలో స్నేహితఅమృతహస్తం సేవా సమితి సేవలు విస్తృతం చేసేందుకు నూతన భవన నిర్మాణం కొరకు విరాళాలు సేకరిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం నారాయణ కళాశాల ప్రిన్సిపల్ సుమన్‌కుమార్, అధ్యాపక బృందం విద్యార్థులతో సేకరించిన రూ.5,116లు విరాళాన్ని సేవా సమితి అధ్యక్షుడు రాజుకు అందజేశారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

వల్లూరు: ప్రజలకు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీఓ జయశ్రీ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు జరిగిన శిక్షణా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పన్నులు, నీటి పన్నులు 100 శాతం వసూలు చేసి ప్రతి ఒక్కరూ తమ పంచాయతీలను అభివృద్ధి పథంలో నిలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ప్రసాద్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

వల్లూరు: కడప- తాడిపత్రి ప్రధాన రహదారిపై వల్లూరు మండల పరిధిలోని తప్పెట్ల సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బీ సుబ్బులయ్య అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు సుబ్బులయ్య అనే వ్యక్తి వల్లూరు నుంచి కమలాపురానికి ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తుండగా తప్పెట్ల సమీపంలో ఆటో, బైక్‌ను ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న సుబ్బులయ్య తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స కోసం అతన్ని 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

హెచ్‌ఐవీకి గురికాకుండా జాగ్రత్త వహించాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపల్ అమల్‌రాజ్

పులివెందుల టౌన్: యువత హెచ్‌ఐవీకి ఎవరూ గురికాకుండా చూడడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక లయోలా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా హెచ్‌ఐవీ గురించి మీకు తెలుసా? అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య, కళాశాల ప్రిన్సిపల్ అమర్నాథ్ మాట్లాడుతూ వ్యాధి వచ్చిన తర్వాత బాధపడే కన్నా ముందే జాగ్రత్త చర్యలు పాటించడం మంచిదన్నారు. యువత దేశానికి ఆదర్శంగా నిలవాలి...కానీ హెచ్‌ఐవీకి గురి కాకూడదన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించి తద్వారా ఎక్కువ మంది హెచ్‌ఐవీ పరీక్షలు చేసుకునేందుకు ముందుకు వచ్చేలా కార్యక్రమాలు జరగాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీడీఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ వల్లి, ఐసీటీసీ కౌన్సిలర్ పుష్పరాజు, శాంతి, మేరి, ఆశ, తదితరులు పాల్గొన్నారు.

ఇ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి

కమలాపురం: మండలంలోని రైతులందరూ తాము సాగు చేసిన పంటలకు తప్పని సరిగా ఇ-క్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల ఏఓ సరస్వతి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని దేవరాజుపల్లెలో జరుగుతున్న ఇ-క్రాప్ బుకింగ్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రైతు సంబంధిత రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వీఏఏలను కలిసి ఆధార్, భూమి పాసు పుస్తకం జిరాక్స్‌లను అందించి తాము సాగు చేసిన పంటలకు ఇ-క్రాప్ బుకింగ్ చేసుకోవాలన్నారు. ఈ-క్రాప్ బుకింగ్ చేసుకున్న వారికే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు.

ఇ –పంట నమోదుపై అవగాహన

కొండాపురం: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను ఇ– పంట నమోదు చేయించాలని మండల తహసీల్దార్ కె. మాధవకృష్ణారెడ్డి తెలిపారు.సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, రైతుభరోసా కేంద్ర సిబ్బందితో మండల వ్యవసాయ అధికారి ఏవీ రామంజులరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇ-పంట నమోదుపై అవగాహన కల్పించారు.

సమస్యలు పరిష్కరించాకే సర్దుబాటు చేపట్టాలి

వేంపల్లె : సమస్యలు పరిష్కరించిన తర్వాతనే ఉపాధ్యాయుల సర్దుబాటు చర్య చేపట్టాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను నిలిపివేయాలని కోరుతూ ఎంఈఓ లు జాఫర్ సాదిక్, స్టాలిన్ ఐజాగ్ లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల నుంచి వస్తున్న గ్రీవెన్స్‌ను పరిష్కరించకుండానే ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ లాగడం అసంబద్ధమైన చర్య అని అన్నారు. ముందుగా ఉపాధ్యాయ సంఘాలు లేవనెత్తిన సమస్యలకు పరిష్కారం చూపిన తర్వాతనే సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు.ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాల పట్ల సానుకూలమైన వైఖరి లేదని అనిపిస్తుందని అందుకే అసంబద్ధమైన సర్దుబాటు విధానాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు ధర్మారెడ్డి, రాజశేఖర్, రీజియన్ కన్వీనర్ ప్రతాప్ రెడ్డి, కోకన్వీనర్ శ్రీనివాసులు రెడ్డి, జిల్లా కౌన్సిలర్ చంద్రమోహన్ రెడ్డి, కమిటీ కన్వీనర్ జనార్దన్ రెడ్డి, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లక్ష్మీనరసింహ, భాస్కర్ రెడ్డి ఆర్థిక కార్యదర్శి మహబూబ్బాషా జిల్లా కౌన్సిలర్లు రాయుడు, రవి కుమార్, జయప్రద తదితరులు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సురేష్‌రెడ్డి

వేంపల్లె: చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వేంపల్లె సీఐ సురేష్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నచిన్న విషయాలకు ఘర్షణకు దిగి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. సత్ప్రవర్తనతో.. ప్రశాంత వాతావరణంలో జీవనం కొనసాగించాలన్నారు. ఘర్షణలకు పాల్పడి చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటే ఉపేక్షించబోమన్నారు. జిల్లా బహిష్కరణ చేసేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఏదైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిరుద్యోగులపై వేధింపులు ఆపాలి



కమలాపురం: తహసీల్దార్ శివరామిరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న చంద్రశేఖర్, స్కీం వర్కర్లు

కమలాపురం: రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి చిరుద్యోగులపై జరుగుతున్న రాజకీయ వేధింపులు ఆపాలని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి పి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపు మేరకు ఆయన కమలాపురం తహసీల్దార్ శివరామిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏళ్ల తరబడి రోజువారి వేతనంతో పని చేస్తున్న స్కీం వర్కర్లతో అధికార పార్టీ నాయకులు బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజీనామా చేయని వారిపై సరిగా పని చేయడం లేదనే అసంబద్ధ ఆరోపణలు చేస్తూ తప్పుడు ఫిర్యాదులు ఇచ్చి అధికారుల ద్వారా స్కీం వర్కర్లను తొలగించడాన్ని ఖండిస్తున్నామన్నారు. కరోనా కష్ట కాలంలో ప్రాణాలకు తెగించి పని చేసిన స్కీం వర్కర్లను బలవంతంగా తొలగించాలనుకోవడం ప్రభుత్వ తిరోగమనానికి నాంది అన్నారు. కార్యక్రమంలో ఆశా, అంగన్వాడీ, వివిధ సంఘాల నాయకురాళ్లు మరియమ్మ, రాణి, అమ్ములు, భారతి, యశోద, శోభారాణి, వసంత, వెంకట లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొండాపురంలో.

కొండాపురం: జాతీయ మహాత్మగాంధీ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లను, అంగన్‌వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులతో బలవంతపు రాజీనామాలను తక్షణమే ఆపాలని ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు సుబ్బరావు,ప్రధాన కార్యదర్శి పి వెంకటరమణలు డిమాండ్ చేశారు.ఈమేరకు సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో కె. మాధవ క్రిష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులపై ఒత్తిడి తెచ్చి బలవంతంగా రాజీనామాలు చేయించడం సరైన పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో బహుదూర్, తారాదేవి, శివపార్వతి తదితరులు పాల్గొన్నారు

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించడం తగదు

వేంపల్లె: వివిధ కార్యాలయాల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న అంగన్వాడీ, ఆశా, మిడ్ డే మీల్స్, ఉపాధిహామీ, డ్వాక్రా, మంచినీటి, గ్రామ పంచాయతీ, ఆయా విభాగాల్లోని చిరుద్యోగులను తొలగించడం తగదని ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. ఈమేరకు ఏఐటీయూసీ జిల్లానేత బాదుల్లా, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బల్లారపు రామాంజనేయులు, ఆయా యూనియన్ల అధ్యక్షులు సరస్వతి, రియాజ్, లక్ష్మయ్య, రామాంజనేయులు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ హరినాథ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నియమితులై ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను అధికారులతో తొలగించే విధానాలను స్వస్తి పలకాలని ఏఐటీయూసీ రాష్ట్ర వ్యాప్తంగా పిలుపునిచ్చిందన్నారు. రోజు వారి వేతనం మీద ఆధారపడి జీవిస్తున్న చిరుద్యోగుల ఉపాధిని కేవలం గత ప్రభుత్వ హయాంలో నియమితులయ్యారన్న సాకుతో తొలగించాలని అధికార పార్టీ నేతలు కోరడం శోచనీయమన్నారు. ఏ పార్టీలకైనా అధికారం శాశ్వతం కాదని, ప్రజలకు వివిధ సేవలు అందించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం శాశ్వతమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో లక్షలాది మంది పనిచేస్తున్నారని, వీరిలో మహిళలు పెద్దసంఖ్యలో ఉన్నారన్నారు.

గువ్వలచెరువు ఘాట్‌రోడ్డులో ట్రాఫిక్ జామ్

చింతకొమ్మదిన్నె: కడప-రాయచోటి ప్రధాన రహదారిలోని గువ్వల చెరువు ఘాట్ రోడ్డులోని నాలుగో మలుపు వద్ద సోమవారం రాత్రి రోడ్డుకు అడ్డంగా లారీ నిలబడిపోయింది. దీంతో ఘాట్ రోడ్డులో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సీకేదిన్నె ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి వెంటనే స్పందించి తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్రేన్ సహాయంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీని తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న కృష్ణమూర్తి

వేంపల్లె: సేంద్రియ, జీవన ఎరువుల వాడకం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని నవభారత్ ఫెర్టిలైజర్స్ ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వేంపల్లె, నందిపల్లె గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సాగులో రసాయన ఎరువులు వాడడం వల్ల ఆహార ఉత్పత్తులు విషతుల్యం అవుతాయన్నారు. అలాగే భూమిలో సారం తగ్గిపోతుందన్నారు. సేంద్రియ, జీవన ఎరువులు భూమిలోని మిత్ర పురుగులైన సూక్ష్మజీవులను అభివృద్ధి చేసి మొక్కలకు కావాల్సిన పోషకాలను అందిస్తుందని, వ్యాధినిరోధక శక్తిని పెంచుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సురేష్, రంగప్రసాద్, రైతులు పాల్గొన్నారు.